


# విషవలయం

తెల్లవారింది. చీకటి విడిపోయి, వెలుగుకు తావిచ్చింది. విశాలంగ తన దుప్పటి పాతన్నైచి, దూరతీరాలకు పారిపోయింది. ఉషోరేఖలు ప్రాచీ తటీ సౌందర్య రేఖలతో శుభోదయ శుభ్ర చిత్రానందాన్ని ఉపాసకులకు పంచిపెట్టాయి. రాగరంజితమైన ఉదయ బాల తొలివవ్వుల చిల్కరించి, మేల్కొంచిన శుకశారికలను పలుకరించి, దవ్వుల పువ్వుల సుగంధాలకై దిక్కు దిక్కులకూ పరుగు తీస్తింది.

“నల్లగుట్ట” మీది తన పటకుటీరంనుంచి క్రిందికి దిగివస్తున్నాడు తొలిచిన మెట్ల మీదుగా రాజయోగి. కుడిచేతివైపు గుట్ట నానుకొని రెండు వందల గజాలలో జలజలా పారిపోతున్నది జమ్ములేరు. ఎడమవైపు అరమైలు దూర[illegible] [illegible]

నాగుబామంటే ఎందుకో ఏమిటో భయం. చూడడానికి భయంకరంగానే ఉంటుంది. కాని తనజోలికి వస్తే కాని నాగుబాము ఎవరినీ ఏమీ చేయదు. మానవునికన్న వేయివిధాల నయమంటే అతిశయోక్తి ఉందా?

గ్రామంలోని కలకలం వినిపిస్తున్నది. ఆ ప్రశాంతమైన ఉషస్సులో యోగి తిన్నగా మెట్లుదిగి జమ్ములేరువైపు నడిచాడు. గంగా

**ఇలపావులూరి శేషగిరిరావు**

జలంవంటి స్వచ్ఛమైన ఆ ఏటి నీటిలో స్నానం ముగించుకొని, తూరుపు తిరిగి సూర్యాభివందనం చేశాడు. చేతిలోని జల కుండిక నిండుగా నీరు నింపుకొని గుట్టవైపు సాగి వచ్చాడు.

ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్నాడు యోగి. ఎదురుగా కొండనిండా గుబురుగా పెరిగిన చెట్లు; ఆ చెట్లకు అల్లిబిల్లిగా అల్లుకొని పోయిన గురువిందతీగలు; అప్పటికే ఎత్తుగా వెత్తుమీద నరసింహస్వామి ఆలయం. ఆ రోజు నృసింహ జయంతి. కోవెలలో గంటలు మ్రోగుతున్నాయి. యోగి త్వరగా వెళ్లాలను కున్నాడు; పురోగమిస్తున్నాడు.

హఠాత్తుగా ఆగిపోయింది యోగి పాదం; నిలిచిపోయాడు. మెట్టుమీదికెత్తిన కాలు క్రిందికి తీసుకున్నాడు. ప్రక్క పొదలోనుంచి

కంటి రక్షణకు, సౌందర్యానికి
దర్బార్ కాటుక (రిజిస్టర్డు)





రాంబీర్ కంపెనీ, బొంబాయి-4.

శ్రేష్ఠతలో విశిష్టమైన కాఫీ




ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ
H.O. గుంటూరు-2.

# విషవలయం

బయటికి వచ్చిన పాము మెట్టు మధ్యనే నిలిచి పోయింది. చుట్టచుట్టుకొని పడగ విప్పింది. భుగభుగ కనలే విషవాయువులను ప్రసరించి "భుస్సు" మంది.

కదలక మెదలక నిలిచిన రాజయోగి తథాగతుని పాలరాతి శిల్పంలా ఉన్నాడు. మెల్లిగా నవ్వాడు. అలసాలసమైన ఆ అలతినవ్వులో శాంతి కాంతి శ్రీలు సుస్పష్టంగా ప్రతిఫలించాయి. ఆ గంభీరమూర్తి క్షణం ఆగి, నిశ్చల కంఠంతో అన్నాడు:

"రా, రా! సందేహించకు. కాటు వెయ్యి!"

పడగ ముడుచుకున్నది పాము. పరుగున మరుగుకు పోయిం దా పాము!

నవ్వుతూన్న కళ్లతో నలుదిక్కులూ పరికించి మెట్లెక్కిపోయాడు యోగి. కోవెలలోని దేవుని దర్శించి వచ్చాడు. కుటీరం ముందున్న గండశిలమీద కూర్చున్నాడు.

పోయిన నాగుబాము జ్ఞాపకం వచ్చింది. మందంగా హసించాడు యోగి. గతకాలపు స్మృతులేవో అప్రయత్నంగా అతని మెదడులో కదిలినాయి. అనంతాకాశంవైపు చూస్తూ కూర్చున్న అతని కళ్లముందు కాలచక్రం ఇరువది సంవత్సరాలు వెనక్కు తిరిగింది—

అది సాయం సమయం. సూర్యుడు పడమటి పడకటింటిలోనికి పోవడానికి ఎక్కువ ఆలస్యంలేదు. ఆ కొంచెం ప్రొద్దూ కొండల్లో పడేలోగా ఇంటికి చేరుకోవాలని త్వరగా దారికి సాగుతున్నారు పొలాల్లోని కూలిజనం. ప్రొద్దుటి నుంచీ జొన్నకోత కోయించి, తలకొక నాలుగు పట్లు కంకుల కూలిపెట్టి, చేను చుట్టూ తిరిగి చూచుకొని సాగుతున్నారు ఆసాములు. బస్తీలలో కార్మికులు సైరన్ కూతతో చక్రాలు సమలాపేసి బయటికి నడుస్తారు. పల్లెల్లో సూరన్నే సైరన్! ఆయన ముఖం కనుమరుగు కాగానే అనురుసురైన ప్రాణాలకు కొన్త హాయి కలిగేటట్లు సల్లాపాలాడుతూ బిలబిలా, గట్టుతెగిన ప్రవాహంలా, పల్లెకు పరుగు పెడతారు. జోగిరెడ్డిపల్లె డొంకంతా కూలీలతో, దొర పొగాకు కంపెనీల ప్రక్క తారు రోడ్డులా కిటకిటలాడింది. కాలి అందెల ఘలంఘలలతో పండువన్నెల పకాపకలు శ్రుతి గలిపాయి. దారిపొడుగునా నడిచే జంటలలో శివపార్వతీమూర్తులు గోచరించాయి. సంధ్యాసమయ శివతాండవ వర్తనాలు దిశలలో మారుమ్రోగుతుంటే, ఆ దృశ్యం గేయ నాటికా రంగస్థలాన్ని కళ్లకు కట్టుతున్నది.

రద్దీ తగ్గిన డొంక ప్రేయసిని వీడిన రసికునిలా నిట్టూర్చింది. సంజకెంజాయలను కాదని కారుచీకటి రంగుదుప్పటిని కప్పుకొనాలని చూస్తున్నది రాత్రి రాణి. అంతా పల్లెకు చేరుకున్నారు. సద్దుమణిగింది. చీకటి రాక

ముందే తామూ యీలందగ్గరకు చేరాలి. వచ్చి జొన్నచొప్ప మోపులు బండిమీదవేసిన రాజయ్య ఒక్క ఎగురుతో, నొగలెక్కాడు. వీపులమీద చేయి పడిందో లేదో అంబరంతో లేచి దూకినా యవి. రాజయ్య ఎంతో శ్రద్ధగా మేపుతున్న మేలురకం ఒంగోలు జాతి గిత్తలవి. పాలుగారే చెక్కిళ్లు, పట్టువంటి గంగడోళ్లు, పొడవుగా ముందుకు వస్తూన్న కొమ్ములూ గల యీ గిత్తలు రెండూ రాజయ్యకు రెండు కళ్లు. ఆ కళ్లు ఆరూ కలిసి అనేక రహస్యాలు అవకాశం వచ్చినప్పుడల్లా మాట్లాడుకుంటాయి. తెల్లని కొండలనుంచీ పారే యమునలాగా మూపులనుంచీ బొడ్డు క్రిందికి వేసిన పల్లని బొడ్డువారులు, పింగాణీ కప్పుమీది నీలి తీగె నగిషీలాగా అద్దాలబిళ్ల సిగమోరలు, నందివాహనుడు ధరించే నాగాభరణాలలాగా గిట్టలకు బెత్తెడుపైగా కట్టిన పల్లని వెంట్రుకల తాళ్లు — ఆ గిత్తల అందాన్ని అధికం చేస్తాయి. రెండు కొమ్ముల మధ్యగా కట్టిన బందరాముడి "బండికుచ్చులు" అటూ యిటూ ఎగిరి నాట్యం చేస్తూంటే, కన్నార్పకుండా చూడడం సరదా రాజయ్యకు. మెళ్లో కట్టిన కంచుమువ్వల కమ్మని సంగీతం వింటే పంచప్రాణాలూ లేచివస్తాయి రాజయ్యకు.

రాజయ్య గిత్తల తోకలు తాకాడు. త్రాచుల్లాగా, లేడుల్లాగా పరుగెత్తుతున్నాయి అవి. దారంతా దుమ్ము రేగుతున్నది. "—ఎల్లిపోతుందెల్లిపోతుంది — బండెల్లి పోతుందెల్లిపోతుంది!!" జోరుగా, హుషారుగా యీలవేస్తున్నాడతను. క్షణంలో డొంక మలుపు తిరిగింది బండి. బండి చప్పుడుకు జడిసిన రత్తాలు నెత్తిమీది చొప్ప మోపు ఎత్తి నేలమీద పడేసింది. బెదిరిన లేడిలాగా ప్రక్కకు తప్పుకున్నది. "అబ్బ! ఏం దూకుడో! మనుసులు అగుపడరా యేం!" గొణిగింది రత్తాలు.

అతను వెనక్కు తిరిగి చూచాడు. అమ్మాయి నెత్తిమీది మోపు క్రిందపడింది. "అయ్యో! పాపం!" గిత్తల పగ్గాలు పట్టాడు. బండి ఆగింది. దిగి వస్తున్నాడతను. అతణ్ణిచూచి ఎందుకో ఆపాదమస్తకం వణికిపోయింది రత్తాలు. వెర్రెత్తినట్లయింది. ఎదురుగా వచ్చి నిలిచాడు అతను. ఎవరో గంధర్వుడు వినింనుండి నేలకు దూకినట్లయింది, రత్తాలుకు. అప్పుడే ఉదయిస్తూన్న చందమామ మెల్లిగా నవ్వాడు. ఆ చిరునవ్వు చిన్నారి బింబాధరాల మీద ప్రతిఫలించి, ఎదురుగావున్న అతని కళ్లల్లోనికి ప్రసరించింది. ఏదో అనంత పిపాసతో ఆకలిగొన్న అతని కళ్లు ఆ జవ్వని యవ్వన రేఖలను నఖశిఖ పర్యంతం పరిశీలించాయి.

ఈ ప్రకృతి అతని నాకర్షిస్తున్నది!

ఈ పురుషు డామెను త్రాగేస్తున్నాడు!

తమాయించుకున్నాడు రాజయ్య. తొందర తగ్గించుకొన్నది రత్తాలు!

"చొప్ప మోపు ఎత్తేనా?" నిశ్శబ్దాన్ని భంగపరిచాడు రాజయ్య.

"అక్కర్లే. నేనెత్తుకోగల....!" దెబ్బతిన్న అభిమానం మూగగొంతుక విప్పింది. చరచరా వడిచి మోపెత్తుకోబోయిందామె. చొప్ప లేవలేదు. ఎందుకో యింత నీరసమైంది ఒళ్లు. కాళ్లు తేలిపోతున్నాయి. పట్టు చిక్కలేదు. ఇన్నాళ్లకు తాను "అబల" అన్న సంగతి గ్రహించి, రత్తాలు సిగ్గుతో సతమతమయింది. రాజయ్య అన్నాడు:—

"బరువుగా వుందికదూ — ఆనపోతువు!"

"నువ్వేం మోయక్కర్లేదులే. పోనం!"— జవాబు వచ్చింది.

"మొయ్యగలవా—మరి!" రెట్టించాడు గొంతు విప్పిన కోయిలను.

"నేనుగాక నువు మోస్తావేంది?"

"ఇదుగో నూడు మరి" — చొప్పమోపు ఎత్తి బండిమీద వేశాడు రాజయ్య.

"అదేంది? నేనెత్తుకపోతా— కిందెయ్యి!" అంది రత్తాలు.

"మా ఎత్తినవులే — ఇంకా ఎప్పుడు నడుస్తవ్! ఎక్కెక్కు బండి. చీకటైనాది!" అన్నాడు రాజయ్య నొగలెక్కబోతూ.

రత్తాలు బిత్తరిచూపులు చూచింది. రాజయ్య దగ్గరికి వచ్చి— "ఎక్కుతవా, లేదా?" అంటూ రత్తాలును అమాంతం పైకెత్తే ప్రయత్నంలో ఉన్నాడు.

"ఆఁ ఆఁ! కట్టెయ్యి గుర్రాన్ని—నేనెక్కుతాలే!"

రాజయ్యను తప్పించుకున్న రత్తాలు బండెక్కి గడ్డిమోపుమీద కూర్చుంది. బండి సాగింది. చెరువు కట్టమీదుగా బండిబాట— రెండో బండి వస్తే తప్పుకొనే వీలులేని బాటది. కట్టమీది చింతచెట్ల కొమ్మలను గాలి కదుపుతున్నది. చెరువునీటి తుంపరులు కలిసిన చల్లగాలి చింతపూల తావిని కలుపుకొని తిన్నగా వీస్తున్నది. తూరుపున బారెడు ఎగ్రబాకిన చందురుడు కట్టక్రింది తాడిచెట్ల నీడలను తగ్గించి, తన వెన్నెల వెలుగులను ప్రసారిస్తున్నాడు. కోడెకారు చిన్నవాడు రాజయ్య మాగుమీసం దువ్వుకుంటూ రత్తాలువంక చూచాడు. ఆ చురుకుచూపులు రత్తాయికి ఉలుకు పుట్టిస్తున్నాయి. ఆమె చందమామ వంక చూస్తున్నది. మౌన హృదయాలు రెండూ చంద్రగోళం ద్వారా సంకేతాలేవో పంపుకొంటున్నట్లున్నాయి. శశిదౌత్యం సఫలం కాగల తరుణంలో బండి కట్టమీద "గతుక్కు"మంది. రత్తాలు ఉలిక్కిపడి రాజయ్యవంక చూచింది. సిగ్గుతో కందగడ్డలా ఉన్న మొగంతో ఆ చిన్నది అన్నది:

"లేవ చూచి గిత్తల నదిలించు — నీకు పున్నెముంటాది!"

"నువ్వేదో చందమామకేసి మాత్తుంటే— నేనూ ఒక చక్కని చుక్కకేసి చూత్తున్నా!" పొగడీశాడు రాజయ్య.

"ఏచక్కనుందా చుక్క!" కళ్లు తిప్పుతూ అడిగింది రత్తాలు.

"ఇదుగో—ఈడుంది!"

మీ దీక్ష
మనదేశానికి
రక్ష

కెంప్‌వారి దివ్య ఔషధములు
రింగ్‌వర్మ్ ఆయింట్‌మెంట్
చర్మ వ్యాధులకు...
...తామర మరియు ఇతర తల, శారీరక చర్మరోగముల వలన వచ్చు దురదను శీఘ్రముగా వుపశమింప జేయును.


ఎల్విన్ పేన్ బామ్
తక్షణ ఉపశాంతి...
...కండరముల నొప్పులు, వాతశూల, బిగిసిన మెడ, వెన్నును పోగొట్టును • తలనొప్పిని నివారించును • గొంతులోని నస, జలుబు, శైత్యము, చలి జ్వరమునకు దివ్య ఔషధము.
మందును పూయండి—గుణమును చూడండి!

కెంప్ అండ్ కంపెనీ లి., బొంబాయి-28.
maa. KC 3142 TEL




# సారిడన్ 'రోష్'




## నొప్పిని పోగొట్టును, సేదదేర్చును, నవోత్సాహమును కలిగించును

సారిడన్ నొప్పులనుండి త్వరితముగా, నిరపాయముగా, నిశ్చయముగా స్వస్థత కలిగించును. పంటినొప్పి, తలనొప్పి, ఒంటినొప్పి, జ్వర చిహ్నములు, మామూలు అస్వస్థతలకు సారిడన్ వేసుకోండి. పెద్దవారికి 1 బిళ్ళ: పిల్లలకు $\frac{1}{4}$ నుండి $\frac{1}{2}$ బిళ్ళ వరకు.

ఒకే సారిడన్ బిళ్ళ చాలును
ఒక బిళ్ళ ఖరీదు 13 నయా పైసలు

'రోష్' తయారు

ఏకైక డిస్ట్రిబ్యూటర్లు: వాల్టాస్ లిమిటెడ్

JWT-VT-4797

"ఏడనంటావ్?" నెత్తిపైకెత్తి చూసింది రత్తాలు.

"వాపక్కనే—బండిమీదుంది!"

"అబ్బో—వాలదాకుండదే సరాగం! చెరువు కట్టమీద జాగరత లేకుంటే మిగిలికయ్యల్లోకి మనిద్దరం జారి ఊరుకుంటాం. సూడు. లేడి వాయల సూడు!"

మెల్లిగా నవ్వా డాతడు. దాపట గిత్తపగ్గం అని, ఎలపట గిత్తనదిలించి, కట్టమలుపు త్రిప్పి, గట్టిగా "హెయ్" అన్నాడు. పరుగుపట్టిన బసవన్నలు పల్లెవైపు పేగెంతీశాయి.

"ఈడాపు. నే దిగిపోతా!" అంటుంది రత్తాలు.

"మీ ఇంటికాడ దింపేస్తలే!" అంటాడు వస్చిన నవ్వును పెదాలతో దాచుకుంటూ రాజయ్య. పోరాడిపోరాడి పాలేరమ్మ గుడివద్ద దిగినరత్తాలు మోపుతీసుకొని పడమర వీథిని ఇంటికిపోయింది.

పల్లెకు దక్షిణాన సొంత పాలంలో ఉన్న పశువుల యాలం దగ్గరకు బండిని తోలుకొని పోయి, పాలేరు పెద్దిగాడికి పనులు పురమాయించి ఇంటికి వెళ్లాడు రాజయ్య.

• • •

ఆరుబయట పడుకున్న రత్తాయికి సరిగా నిద్రపట్టలేదు. ప్రక్కనున్న జాజిమల్లె పందిరి ఘుమాయిస్తున్నది. దొడ్లో ఉన్న కొబ్బరిచెట్లు మట్టలు వింజామరలు వేస్తున్నాయి. తెల్లని వెన్నెల సోనలు నిర్మలాకాశంనుంచీ జాలువారుతున్నాయి. ఆ నీరవశారదరాత్రి ఆహ్లాదకరంగా ఉంది. కళ్లు ఎంత గట్టిగా మూసుకున్నా కునుకు రాదు. కన్నెమనసు విప్పుకొన్న ఆ చిన్నది కప్పుకొన్నది దుప్పటి. అయినా నిద్రరాదు. అలసిపోయిన సోగకన్ను అలాగే ఆకాశం చూస్తున్నాయి. చందమామనుంచి వస్తున్నాడొక దివ్యపురుషుడు! అందమైన ఆరడుగుల విగ్రహం, నిగనిగలాడే జుట్టూ, మాగారు మీసకట్టూ, కండలు మెలిదిరిగిన నిండైన శరీరం, యౌవన లాలిత్యాన్ని నమిలి ఎరుపెక్కిన పెదవులూ— ఎవరతను!

రత్తాయి ఒళ్లు జలదరించింది. సందెవేళ జరిగిన సరాగం కళ్లముందు నిలిచింది. "బలేవోడు రాజయ్య! అయినా అంత దురుసు మనిసేంది! కోప్పడితే నవ్వేసి ఊరుకుంటడు. ఆ నవ్వు.... ఎంత బాగా నవ్వుతడతను.... అబ్బ! ఇప్పుడు మళ్లీ వళ్లు పులకరేత్తుందాది! అంతా పందెమే అతగాడికి. ఏమి ఉరకలేయుత్తడు గిత్తల్ను! అరక దున్నినా అంతే. ఏపని చేతబట్టినా చెకుముకి రవ్వ. పొరుయాట పండగనాడు అరకల పందెంలో గెలిచి, అంటె వేయించుకున్నాడు చేతికి. ఆయాల దగదగమెరిసే వెండి ముల్లుగర్ర చేతబట్టి, కోపు తలపాగా జుట్టి, కుర్రకారంతా చేతులమీద ఊరేగిత్తుంటే రాజల్లే తిరిగాడు వూరంతా. కొండ్ర యేశాడంటే కొరవగాకుండ సరిపోతది; చాలు పట్టాడంటే నూలుబారుకు నిలబడతది. చుట్టూ వూళ్ల పందెగాళ్లంతా విజయదశమి నాటి రాజయ్యనుచూచి యీసుపడిపోయినారు. పాపం, ఎక్కువగా ఏడిచినోడు మా పెద్ద జీతగాడు; జగ్గడు. ఆడితో అన్నిటికీ పోటీ పడతడు యీడు; ఒక్కటే నెగ్గ లేడు మరి. ఆయాల అమ్మ పిలిపించబట్టిగానీ లేకుంటే పందెపోళ్లతో సిగపట్లు గోత్రం చేసేషోడు జగ్గడు. వాడెప్పుడూ అంతే! వొట్టి దురదగొండి చెట్టు."

దొడ్లో చప్పుడైంది. ఆలోచనా లత తెగింది. పక్కమీద మెదులుతూన్న రత్తాయిని చూచి దగ్గరకు వచ్చింది వాళ్లమ్మ. పలుపు తెంచుకొని పారిపోతున్న పెయ్యదూడను కట్టేసి లోనికి పోతున్న దామె. "మెలకువ వచ్చిందా?" — అని అడిగింది కూతురును.

"అవునమ్మా!" తనకసలు నిద్రపట్టలేదు.

"తెల్లారిందా అమ్మా!" అడిగింది తల్లిని.

"కోడికూసే యాలైంది. కొంచెం కునుకు తియ్యవే!" అంటూ పోయింది తల్లి. కునుకు తీయాలనుకొని కూతురు గట్టిగా కళ్లు మూసికొన్నది.

పాట్టుగూటి మీది కోడిపుంజు "కొక్కొరోకో"... అని త్రిశగతిని అనుకరించింది. పని పాటలు చూచుకోవాలని పల్లెజనం లేచింది!!

జోగిరెడ్డిపల్లెకు పడమర రెండు మైళ్ల దూరంలో ఉంది 'సూదికొండ'; దాని నానుకొని 'యర్రగొండ'. రెండు కొండల మధ్య ఏటవాలు లోయలో ఏటా మంచి పచ్చిక పడుతుంది. గొర్రెల మందలను తోలుకొని ముందు 'ముంతల బోటు'కు చేరి, "కోటేళ్లనరం" మీదుగా లోయలోకి దిగుతారు మందకాపులు. బీటి పుల్లరి చెల్లించనిదే గడ్డి మేపనీయమంటూ ఫారెస్టు గార్డులు అడపాదడపా వీళ్లను అల్లరి పెడుతూంటారు. ఆ తొందరలో మందలను పొలాలమీదికి మళ్లించడం, అవి పైర్లను పాడుచెయ్యటంకూడా కద్దు. కొండక్రింది మెరకచేలన్నీ గుబురుగా పెరిగిన అల్లువేరు సెనగతో పచ్చగా ఉన్నాయి. సెనగంతా పసుపు చల్లినట్లు పూతపూసింది; ఊడదిగి కాయగట్టి గింజ పెడుతున్నది. నట్టనడిచేలో జమ్మిచెట్టు కొమ్మ నరికి చొప్పకట్టలు ఒత్తుగా వేసిన మంచె మీద పైపంచె మెత్తగా పరచుకొని కునుకు తీస్తున్న రాజయ్యలేచి కూర్చున్నాడు. పాటిపొగాకు పొర చుట్ట ముట్టించి 'సూదికొండ' చాయల చూచాడు. దిక్కుదిక్కంతా అడివి కాలినట్లు ఎర్రగా ఉంది. ప్రొద్దు క్రుంకుతున్నది. కనుచూపు మేరలో మందలేవీ కనపడటంలేదు.

మంచెదిగి, సెనగచేల గట్టుమీద "కోలన్న" ఈలవేస్తూ నడుస్తున్నాడు రాజయ్య. మనసులోని బొమ్మ తళుకున మెరిసింది. రత్తాయి మళ్లీ కనబడలేదు. తాను పగలూ, రాత్రీ సెనగచేల కావలాకు వస్తున్నాడు. సందెగూకితే నక్కల బెడద. 'కోటేళ్లనగరం' కాడ "క్కో" అంటూ రాగాలు సాగిస్తాయి. కాస్త బువ్వతిని మళ్లీ మంచెకాడికి చేరితే తెల్లార్లూ నెత్తిమీద చుక్కలూ, చేలమీద నక్కలూ అతనికి నేస్తాలు. నక్కలను కేకేసి తరిమి, చుక్కలను లెక్కిస్తుంటాడతను. మరి పగటేపూట పొలం పోతది రత్తాయి. ఊరికి ఉత్తరాన వాళ్లపొలం. అటుపోతే కనబడతదేమో! మరి వాళ్ల అమ్మ ఉంటే....? అయినా నాగమ్మకు తనంటే కోపంలేదుగా. బాగానే మాటాడుతుంది; మరేద చేస్తుంది. అయితే ఆ జగ్గడుంటాడు. పేపీకోరు యదవ! అయినా పోవాలె. రత్తాయిని చూడాలె.... అతని కాళ్లు డొంకలోనుండి ఉత్తరానికి పదడుగులు గబగబా వేశాయి. ఆశలు అడుగులకంటె ముందు పరుగులు తీశాయి.

'కెవ్వు'మని కేక వినిపించింది. పాతికగజాల దూరంలో కోసిన జొన్నచేను గట్టున ఎవరో మనిషి కనుపించింది. రాజయ్య పరుగెత్తిపోయాడు. రత్తాయి. వణికిపోతున్నది. "ఏందది?" అరిచాడతను.

భయపడుతున్న రత్తాయి బరబరా చేలోకి



అరని ఆకలి

చిత్రం—ఎస్. బాబూరావు (విజయవాడ 2)

పోతున్న పాముకేసి చూపింది. నికార్సైన జెర్రిపోతు. బారెడుంది. కంపతొడుగులా "రుయ్"న పోతున్నది. పారిపోయే పాముతోకను ఒడిసి పట్టాడు రాజయ్య. పట్టుతోనే పైకెత్తి గిరగిరా త్రిప్పాడు. సుళ్లు తిరిగింది పాము. నేలకేసి బాదాడు. చచ్చిపోయింది. ఒక్క విసురుతో అతని చేతిలోని పాము ఒడిసెలలోని రాయిలాగా దూరపు కందిపచ్చెలో పడింది!

పాముచచ్చినా రత్తాయికి భయం తగ్గలేదు. ప్రమానుపడి నిలబడింది.

"ఈపాటి గుండెదానివి ఎందుకొచ్చినవ్ పొలానికి?" — దగ్గరగా వచ్చిన రాజయ్య అన్నాడు.

"అట్టంటేనే నాకు చిర్రెత్తుతాది. నిను నే బిర్చితినా యేం?" — మురమర చూసింది రత్తాయి.

"పోనీలే. నేబోతా. తిరిగి కేకలెయ్యకు మరి!"

నాలుగడుగులు నడిచాడు బాటవైపు.

"నేనూ వత్తానుండవా— మావా!" పిలిచింది రత్తాయి.

నిలిచింది రాజయ్య పాదం; వచ్చి కలిసింది రత్తాయి చేయి!

"మావా!"

"రత్తీ!"

ఆమె అతనిచేతుల్లో వాలింది. సోలిపోయింది. అతని శరీరం ఆ మధుర స్పర్శకు పులకించింది. తీయతీయని భావాలేవో తెరలు తీసికొని వెలువడ గోరినాయి. ఆవేశంలో ఆ అనాఘ్రాత కుసుమాన్ని పెదవులతో స్పర్శించబోయాడతడు. తెలివితెచ్చుకొన్న రత్తాలు పరుగెత్తింది. చెరువు కట్టదాకా వచ్చారు. పెద్ద మరకొమ్మ సిమెంటు గట్టుమీద అలుపుతో చతికిలబడింది రత్తి. అతనామెను ఒడిలోనికి తీసుకున్నాడు. ఆ బలిష్ఠమైన బాహువలయంలో ఒదిగిపోయిందా పంచవన్నెల రాచిలుక. ఆ కౌగిలిలో కోటికోటి స్వర్గాలు గొంతు విప్పి పిలిచాయి. హృదయవీణెలు రెండూ స్వరం కలిపి ఏకశ్రుతి చేసుకున్నాయి. ముగ్ధమోహన రాగాలాపన కనువుగా "సరిగపదసా" స్వరకల్పనకు శిఖరారోహణం జరిగింది. మానవ విహంగం రెక్కలు విప్పుకొని రోదసీయాత్రకు 'నాంది' పలికింది. దివ్య ప్రేమామృతాన్ని దిక్కులకు పంచిపెట్టాలని శరచ్చంద్రిక కంకణం దాల్చి బయలుదేరింది.

వెలుతురును చూచిన ఆ వెండి వెలవెల బోయింది. చివాలున లేచింది రత్తాయి.

"మావా!"

"ఏంది రత్తీ?" — అన్నాడు కొంగు పట్టిన గోపాలుడు!

"నన్నొదులు మావా పరులు చూసేరు!"

నడక సాగించింది రత్తాయి. నవ్వు చాలించి సూటిగా చూచాడు రాజయ్య.

"రేపు మాపిటేల — మా మల్లెపందిరి కాడ..." సిగ్గుతో చేతికి చిక్కకుండా ఇంటికి పరుగు తీసిందామె. చిన్నగా నవ్వి, సన్నగా ఈల పాడుతూ యాలందాపుకు పోయా డతడు!

• • •

పది రోజులు గడిచాయి. సగం నలిగిన జొన్న కంకులకుప్ప నిలువెత్తున కళ్లంలో ఉంది. కంకులబండ నానుకొని, గొంగళి కప్పుకొని కూర్చున్నాడు రాజయ్య. రెండు రోజుల నుండీ పెద్దిగాడిని సెనగచేల కావలికి తోలి, తాను కళ్లంలో పడుకుంటున్నాడు. జొన్న లన్నీ యింటికి చేరేదాకా కాపలా ఉండాలి. చుట్టముట్టించిన రాజయ్య చుక్కల్ని చూస్తున్నాడు. తూరుపున "గొరకొయ్యలు" బారెడు పైకెక్కినాయి; అట్టే పొద్దుపోలేదు. ఊళ్లో సందడిగా ఉంది. ఈ రాత్రి నడిమిబజారులో 'బొడ్డురాయి' దగ్గర తోలుబొమ్మలాట. జోగిరెడ్డిపల్లె మిరాసిదారు బొమ్మలాట రామదాసు యీ వేళ "కీచకవధ" ఆడుతాడు. జనమంతా బువ్వలు తిని బొమ్మలాటకోసం చేరుతున్నారు.

# విషవలయం

గొంగళితో ముడుచుకొని పడుకున్న రాజయ్యకు నిద్రపట్టలేదు. కళ్లు మూస్తే 'రత్తి'; కళ్లు తెరిస్తే 'రత్తి'. నిలువ నలవి కాలేదు; మనసు నిలువనీయలేదు. ప్రక్కనున్న బాణాకర్ర చేతపుచ్చుకొని, 'కిర్రు' లేని ఎత్తు చెప్పులు తొడుక్కొని రాజయ్య పడమటి వీధి చేరాడు. చిమ్మచీకటి. కన్ను పొడుచుకున్నా మనిషి కనపడటం లేదు. నక్షత్ర కాంతి దప్ప మరే వెలుతురూ లేదు. ఆ గుడ్డి వెలుగులో గోడమీదుగా దొడ్డిలోకి దిగాడతను. రత్తాయికోసం వెతికాడు. ఆమె లేదు. అనుకున్నంతా అయింది. తనకోసం చూచి చూచి బొమ్మలాటకాడికి పోయుంటుంది. అతని గుండె గుబగుబలాడింది.

ఇకెందు కిక్కడ?... తిరిగి పోవాలని గోడకేసి నడిచాడు. పడమటింటి తలుపు 'కిర్రు' మంది. వెనుదిరిగి చూచాడతను. తలుపు తీసుకొని యింట్లోనుంచీ ఎవరో యిటే వస్తున్నారు. మల్లెపందిరి వెనుకకు తప్పుకొన్నాడతను. పొడుగైన దుక్కలాంటి శరీరం ఒకటి, పందిరి ముందుగా బలంగా అడుగులు వేసుకొంటూపోయి, దొడ్డి తలుపు తీసి, వీధిలోని చీకటిలోనికి నడిచింది.

ఎవరది?...— అతను గుర్తుపట్టాడు. వాడే... జగ్గడు! నాగమ్మగారి పెద్దజీతగాడు.

"ఔరా నాగమ్మ!" స్తంభించిపోయాడు. కొన్ని క్షణాలలా గడిచాయి.

అతనికిక నిలువ బుద్ధిపుట్టలేదు. తొందరగా బైటపడాలనుకున్నాడు. మల్లిచెట్టుకు పెట్టిన పందిరిమీది బొగిలిపోయిన కొయ్య ఒకటి విరిగి క్రింద పడింది. చప్పుడు విన్నది



గృహబాధ్యత

చిత్రం—ఎ. పండరినాథ్ (ఇబ్రహీంపట్నం)

తలుపు వేసికోబోతున్న నాగమ్మ. చేతిలోని దీపపు వెలుతురు జాజిమల్లెమీద పడింది.

"ఎవరు?" గట్టి కేక ఆ వెలుతురును వెంటాడింది.

అతను నిలువునా నీరైనాడు.

ఆలోచనలు ఒక తెన్ను చూపకముందే నాగమ్మ ఎదురుగా వచ్చింది. నిదానించి చూచింది.

ఏదో తప్పుచేసిన ఖైదీలా ధైర్యాన్ని కూర్చుకుంటున్నాడు రాజయ్య.

"ఏందిట్టా వచ్చినవ్?" అడిగింది నాగమ్మ కళ్లు అదో రకంగాపెట్టి.

"ఉత్తినే..." గొణిగాడు ఏం చెప్పడానికీ పాలుబోక!

"రత్తి బొమ్మలాటకాడికి పోయింది. రా. చీకట్లో నిలబడినవ్?"

తనకంతా తెలుసన్నట్లు చూచింది నాగమ్మ. తేలికపడిందతని మనసు. వెనక్కి తిరిగి పోబోతుంటే మళ్లీ "రా—లోపలికి!" అంది నాగమ్మ లోనికి పోతూ. అతను లోనికి అడుగుపెట్టాడు. నాగమ్మ మంచం చూపి కూర్చోమంది. గూట్లో ఆముదపు దీపం నిశ్చలంగా వెలుగుతున్నది. ఆ మసక వెలుతురులో ముసి ముసి నవ్వులు నవ్వుతూ నాగమ్మ అడిగింది: "ఇంత సీకట్లో వచ్చినవేం రాజా!"

ఆ ప్రశ్నకు ఎంత బెదిరిపోయాడో దానికి రెట్టింపు ఆ సంబోధనకు ఆశ్చర్యపోయాడు.

"ఉత్తినే... యిటు పోతూ..." అబద్ధంతో అతకటం అతనికి చేతకాలేదు. చిరునవ్వు నవ్వింది ఆ ప్రౌఢ. మెలిదిరిగి పోతున్నాడా అమాయికుడు!

"రత్తాయికోసరం అని చెప్పరాదూ?"

పలుకలేదు అతని మూగకంఠం. మౌనం అర్ధాంగీకార మనుకున్నాడు.

"ఇంత బయమా మగాడికి — యీ సెమటలేంది... తుడుచుకో!" ముఖం తుడుచుకొని తలగుడ్డ సరిగా చెక్కుకుంటూన్న అతనివైపు దీక్షగా చూచింది నాగమ్మ. మసక వెలుతురులో మిసమిసలాడుతూ మెరిసిపోతున్నాడతను. విజయదశమినాడు పోటీకి పోయిన జగ్గాలును వెనక్కి పిలిపించింది తాను. తన అరక వెనుకబడి, పరువు పలుచనైనా, తగూలాడకుండా జగ్గడిని సర్దింది తాను. అతడు తనకు 'రతిరాజు'. సాగదీసి చివర మెలిపెట్టిన అతని నూగుమీసం వంగిన మన్మథుని విల్లు. ఆ ఎర్రని పెదవి అల్లెత్రాడు. కోటేరులా ఉన్న అతని ముక్కు ఆ విల్లునుండి దూసుకొని వచ్చి నాగమ్మ హృదయాన్ని తాకిన పూలబాణం!!...

నిలువలేకపోయింది నాగమ్మ. దాపుకువచ్చి వయ్యారా లొలికిస్తూ, "రత్తిని నీవు జేసుకుంటానంటే కాదంటినా?" — అంది. ఆ బుజ్జగింపుకు స్థాయిపడిన రాజయ్య ఏదో

చెప్పబోయాడు.

"నేను కాదనను!" ప్రక్కనే కూర్చున్న నాగమ్మ అంది. "నీ మక్కునేదైతే దాన్ని చేత్తా — రా — నాకు నువ్వు...!" — అతని ముఖం రెండు చేతులతో తనవైపు లాక్కుని అతని పెదాలమీద తన అధరాల నానించ బోయింది.

అతనికి కరెంట్ షాక్ తిన్నట్లయింది. ఒళ్లంతా తేళ్లూ, జెర్రులూ ప్రాకాయి. చివాలున లేచి నిలబడ్డాడు.

"ఏం దిది!" వెర్రిగా, అయోమయంగా, ఆందోళనగా అరిచాడు.

జారిపోయిన వయ్యారాలను కూడగట్టు కుంటూ సన్నగా నవ్విం దామె. "ఏందట్లా బెంబేలు పడిపోతవ్! కూచో!" రెండు చేతులూ పట్టుకొని కూర్చోబెట్టబోయింది. విదిలించు కొని ప్రక్కకు తొలిగాడు.

"రాజా! ఉత్తినే అల్లరిపడకు. తెలివిగా మసలుకుంటే నా కలిమంతా నీదౌతది..." ప్రతిమిలాడిం దా కామార్త.

రాజయ్య కాలిక్రింది నేల గిర్రున తిరి గింది. నిలువెత్తు అసహ్యం ముంచుకొస్తు న్నది. ఛీత్కారం చేశాడు. "ఏళ్ల వచ్చినా ఏం లాబం...?"

"లేదు రాజా! ఇంకా ముప్పయి అయిదు నిండలేదు!" ఒళ్లు విరిచి కళ్లనీళ్లతో కావి లించుకోబోయిం దాతని నామె.

"చేసే పాపాలు చాలక, సిగ్గిడిచి, చిన్నోళ్ల జోలి కూడానా?" — పరమ అసహ్యంతో బలంగా ఒక్క తోపు తోశాడు. అతని శరీరం ఉడికిపోతున్నది. వేయి కొలుములు ఒక్కసారి మండినా అంత వేడి పుట్టింపలేవు.

తూలి, దూరంగా పడింది నాగమ్మ. ఆమెలో వాంఛ ఎక్కువైంది. నిరాకరించే కొద్దీ అది విజృంభించింది. ఆపాదమస్తకం కంపించిపోతున్నది. జుట్టు చెదిరింది. కట్టు జారింది. నిట్టూర్పులతో ముక్కుపుటా లెగురుతున్నాయి. ఆకలిగొన్న ఆమె చూపులు రాజయ్య వక్షస్థలంమీదున్నాయి. అక్కడ చేరితే ఉంది సుఖం అని అర్రులు చాచు తున్నాయి.

రాబోతున్న రక్కసిని విదిల్చి ఒక్క ఊపుతో గుమ్మందాటి వెళ్లిపోయా డతడు!

"రాజా!"

ఆ కేకలో అనంత రాక్షసకామం ఖంగున మ్రోగింది.

లేచిన నాగుబాము బుసలు కొట్టింది.

తీరని కోరిక విషం కురిసింది.

కసి తీర్చుకోవడానికి పగ పట్టింది!!

"బొమ్మలాట బలే రక్తి కట్టింది. పాడు కీచకుడికి బలే శిక్ష జరిగింది" — అనుకుంటూ ఇండ్లకు చేరారు రైతు యువతులు.

• • •

"మామ" కనబడటంలేదు. రెండు మూడు సార్లు చేనిగట్టున కనబడికూడా, తలెత్తకుండా పోయినాడు. రత్తికి పిచ్చెత్తినట్లున్నది. ఇయాల మామను చూడనిది నిలిచేట్టు లేదు ప్రాణం. మసకచీకటి పడింది. రత్తి నేరుగా మంచెకాడికి పోయింది. ఒక్కడే గూబలా కూర్చొని ఉన్నాడు రాజయ్య. మంచె క్రింది రత్తి "మావా" అని పిలిచింది.

"ఎవురది?"

"మావా!"

"రత్తీ — నువ్వా!"

చెయ్యి అందించాడు. మంచెపైకి వచ్చిన రత్తి అతని చేతుల్లో ఒరిగిపోయింది.

"మావా!"

"రత్తీ...!"

"నేను నీ కక్కర్లేదా?" — రత్తి కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి.

అతనామెను గుండెకు హత్తుకున్నాడు.

"నువ్వు కావాలి — రత్తీ — నువ్వే కావాలి!"

"మరి నాకాడికి రావేం?"

జవాబు చెప్పలేదు. చెప్పలేక ఆగిపోయాడు రాజయ్య. క్షణాలు నిశ్శబ్దంగా గడుస్తున్నాయి. దూరాన చేనిగట్టున కొంచెం అలికిడి తప్ప మరెక్కడా చలనంలేదు.

"రత్తీ!"

"ఏంది మావా!"

"మన మీ దుండలేం. యాడికైనా పోదాం — నాతో రా!" కళ్లలోకి చూస్తూ అడిగాడు.

"ఏడకు పోదాం మావా!"

"ఏడకైనా. యాడికి దూరంగా వున్న చోటుకు పోదాం!"

"అమ్మనూ — అందర్నీ వదిలేసే? బయ మేస్తది మావా! యాడ మనకేం బాద!"

"ఊరకే అడ్డమాట లెయ్యకు. నేను కావాలనుకుంటే రా —" మొగం తిప్పుకున్నాడు రాజయ్య.

"కోపమా — మావా! వత్తాగా. నిన్నొదిలి నేనుండలేను..." రత్తి అతని గుండెలో దాగు కున్నది.

"వేకువజామున చెరువుకొమ్మకాడ..."

ఏదో ఇంకా చెవిలో చెప్పాడు ప్రేమికుడు రాజయ్య. తలూపింది మంచె దిగుతూన్న దివ్య ప్రణయిని రత్తాలు.

* * *

సెనగచేలమీదుగా వచ్చిన జగ్గులు రత్తాయి వచ్చేసరికి యింట్లో నాగమ్మతో గుస గుస లాడుతున్నాడు. "ఏమే. ఇంత పొద్దోయిందాకా ఏంజేత్తుండవ్?" అన్న అమ్మ ప్రశ్నను పట్టించుకోకుండానే ఆమె లోనికి పోయింది. నాగమ్మ జగ్గడికేదో చెప్పి పంపింది. కడుపు నిండా అన్నం తిని కమ్మగా నిద్రపట్టించింది మల్లెపందిరి ప్రక్క మంచంమీద పడుకున్న రత్తమ్మ.



'ఆకులు రాలి శాఖలకు
ఆకులపాటు ఘటిల్లె'
చిత్రం—సువర్ణ (మద్రాసు-20)

ప్రొద్దుపోయింది. నాగమ్మకు అన్నం సయించలేదు; నిద్రపట్టలేదు. భరింపరాని బాధ పడుతున్నది. ఆమెలో ద్వేషం బుసలు కొడుతున్నది. అసూయ కసి రేపుతున్నది. నీతికి ఏనాడో కట్టిన గోరీ పూతపూచి 'పాపం' పండుతున్నది. అది యీ రోజు జగ్గడి మాటలు విన్నాక మరీ ఎక్కువైంది. వాడు తనను కాదన్నాడు. "రతిరాజు" ఇప్పుడు "రత్తి రాజు" అయినాడు. వాడి అందం తనకందలేదు. రత్తికి అందింది. అది సుఖిస్తున్నది. అంతు తెలియని ఆనందంలో హాయిగా నిద్దరోతు న్నది. ప్రేమ ముదిరి ప్రయాణాలదాకా వచ్చింది. జంట ఎగిరిపోవడానికి సిద్ధపడింది. తన్ను కాదన్నవాడు సుఖపడకూడదు; వాడితో ఎవరూ సుఖపడకూడదు. రత్తి... తన కూతురు... కాని తన స్వర్గానికి అడ్డం వచ్చింది. పళ్లు కొరికింది నాగమ్మ. విషవల యంలో చిక్కుకపోయింది నాగమ్మ. ఈ అమృతం తనకు రుచించదు; దీన్ని హాలా హలంగా మార్చాలి. ఈ ప్రేమ తనకు గిట్టదు; దీన్ని ఛిన్నాభిన్నం చేయాలి. అంతే...ఆ కాముకి లోని పైశాచిక స్త్రీత్వం బట్ట విప్పి నృత్యం చేసింది; ఆ దారుణ తాండవోజ్వల జ్వలన జ్వాలలో మాతృత్వం మంటగలిసిపోయింది. హృదయం భయపడి రక్కసి కసికి 'దాసోహ' మన్నది.

నిశ్శబ్దాన్ని చీల్చుకొని అడుగుల సవ్వడి. జగ్గడు వచ్చాడు చెమటలు కారిపోతూ. పోయిన పని చేసివచ్చానన్నాడు. తక్కిన పని పూర్తి చేయ మని చెప్పి, నాగమ్మ తలుపులు బిగించుకొన్నది. ఆ పరమకిరాతుడు పాపాన్ని మూటగట్టుకొని పోయి, తన చుట్టు గుడిసెలోని మట్టిముంతలో దాచుకొని, తిరిగివచ్చి నాగమ్మగారి పశువుల కోష్టంలో వంగనాచిలా నిద్రపోయాడు.

• • •

తెల్లవారింది. చెరువుకట్టమీద వేకువ

# విషవలయం

నుండీ రత్తిరాకకు ఎదురుచూస్తున్న రాజయ్యను వెతుక్కుంటూ వచ్చాడు పెద్దిగాడు. "రాజి బాబూ! గిత్తలు మేయలేదు; వగురుత్తుండాయి. తొరగా రండి!" అన్నాడు వాడు రొప్పుతూ. ఇద్దరూ యాలంవైపుకు దౌడుతీశారు.

కామందు మల్లారెడ్డి గిత్తలను పరిశీలిస్తున్నాడు. కొడుకు రాగానే "నీకోసం చూత్తున్నాయిరా!" అన్నాడు దుఃఖంతో బొంగురుపోయిన కంఠంతో.

రాజయ్య గిత్తల మోరలను పైకెత్తి ముఖాని కానించుకున్నాడు. ఆ అరుకళ్లా క్షణం సేపు మాట్లాడుకున్నాయి. గిత్తలు రెండూ మోరలు వాల్చి కళ్లు—తళతళ మెరిసే ఆచక్కని కళ్లు—మూసుకున్నాయి. ఆ మెడలను కావిలించుకొని, కళ్లవెంట నీరు కారుతుంటే చలనంలేని శిలైనాడు రాజయ్య.

ఎండెక్కినాక నాలుగుమోటల బావిమీద 'కబిల'కు పోయిన రైతులు బావిలో శవం ఉన్నదని మునసబుగారికి చెప్పారు. రిపోర్టుపోయింది. పోలీసులు వచ్చారు. శవాన్ని బయటికి తీశారు. స్త్రీశవం. అందరూ గుర్తుపట్టారు. నాగమ్మ కూతురు రత్తమ్మ! అందరూ నోళ్లు నొక్కుకున్నారు. ఊరు అట్టుడికినట్లు ఉడికిపోయింది.

"రత్తిపోయింది!"

గిత్తలప్రక్కన కూర్చున్న రాజయ్య వెర్రికేక పెట్టాడు. బావి దగ్గరకు పరుగెత్తాడు. పెద్దిగాడు వెంట పోయినాడు.

జనం అంతా ఉన్నారు. పోలీసులు ఉన్నారు.

"రత్తి" లేదు. "శవం" ఉన్నది!

నెత్తి బాదుకుంటున్నాడు రాజయ్య!!

శవ పంచాయితీలో నాగమ్మ "రాజయ్యమీద నాకు అనుమానం" అని స్టేటుమెంటు ఇచ్చింది. జగ్గడు సాక్ష్యం పలికాడు.

రాజయ్య తలెత్తి చూచాడు! నాగమ్మలోని నాగుబాము కనిపించిం దతనికి. జగ్గడిచేతి విషపు గడ్డి తిన్న గిత్తలూ, నాగమ్మ బుసలకు బలియైపోయిన రత్తీ తనవైపు జాలిగా చూస్తున్నట్లనిపించింది. రాజయ్య కొయ్యబారిపోయినాడు. పోలీసులు రాజయ్యను పట్టుకపోయారు. ముసలి మల్లారెడ్డి అల్లాడిపోయాడు. శక్తినంతా వినియోగించి, జామీనుమీద కొడుకును తీసుకొని వచ్చాడు. సెషన్సులో విచారణ జరుగుతున్నది.

రెండు నెలలైనాక మట్టిముంతలోని బంగారు పుడక జగ్గడి పెళ్లాం ముక్కు నలంకరించింది; ఊరంతా పలకరించింది. కథ అడ్డం తిరిగింది. పోలీసులు తుప్పు రాలగొట్టాక, జగ్గడు కేసు ఒప్పుకొన్నాడు. అయినా వాడికి ధీమా ఉంది. నాగమ్మ డబ్బుపోసి లాయరును పెట్టి, కేసు కొట్టేయిస్తుందని, ఆశ ఉంది. రాయబారం పంపాడు; విఫలమైంది. "నీ కర్మ నీది. నేనేం జేయగల"నంది క్రొత్తచవులకోసం ఎదురుచూస్తున్న నాగమ్మ. విచారణ పూర్తయింది. రాజయ్యను "నిర్దోషి"గా నిర్ణయించారు. జగ్గడికి ఉరిశిక్ష చెప్పారు. నవ్వుకున్నాడు వాడు. కోర్టులోనుండి జైలుకు తీసుకెళ్లుతున్నారు పోలీసులు వాడిని. ఉరుటున ఎగిరిన జగ్గడు పోలీసు చేతిలోని తుపాకి లాగి, బయొనెట్‌తో ఒక్కటే పోటు పొడిచాడు ప్రక్కను పోతున్న నాగమ్మను. ఆమె విలవిలలాడుతూ నేలవాలింది; నెత్తురు మడుగైంది.

"నీకింతకంటె మంచి చావు పనికిరాదు, నాగమ్మా!"— వెకిలి నవ్వు నవ్వాడు చావబోతున్న సాథీ జగ్గడు! పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని పోయారు.

నాగమ్మ నశించింది. నారీలోకం హసించింది. కానీ అప్పటినుండీ రాజయ్యమాత్రం నవ్వడు; నవ్వలేడు. అలాగే శూన్యంలోకి చూస్తూ గంటల తరబడి ఉండిపోతాడు! ముసలితండ్రి గతించాక ఆస్తియావత్తూ జోగిరెడ్డిపల్లెలోని శ్రీ సీతారామస్వామివారి అంగరంగ వైభోగాలకు వ్రాసి యిచ్చాడు. ఇల్లుకూడా ధర్మసత్రంగా వాడుకొనండని విల్లుకాగితం వ్రాసి కరణం గారికి పంపించి, ఒక వేకువ జామున, చెరువు కట్టమీదుగా, ఒంటరిగా, ఏ దూరతీరానికో మహాప్రస్థానం చేశాడు రాజయ్య.

ఆ దివ్య ప్రణయిని 'రత్తి' ఈ లోకంలో లేదు; ఆ భగ్నప్రేమికుడు ఇప్పుడు 'రాజయ్య'గా లేడు. అప్పటివాళ్లెవరూ ఇప్పుడిక్కడ కనుపించరు. నాగమ్మ మాత్రం ఈ నాగుపాము పడగలో తొంగిచూచి లీలగా గోచరించింది. "కాటు వేయలేక పొదలోకి దూరిన ఈ పాము కన్న నేనే మిన్న" — అని సణిగినట్లయింది.

రాజయోగి నిట్టూర్చాడు!

"నాగుపాము పోయింది. మనిషికంటె అది మంచిది!!"

అనంతాకాశంవైపు చూస్తూ కూర్చున్న రాజయోగి పెదవిమీద నిర్లిప్త మందహాసం వెలసింది! ★

పంచమ వేదమను
శ్రీమదాంధ్ర మహాభారతము
వచనకావ్యము ఆదిపంచకము
(ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగ పర్వములు) రసవత్తరమైన భాషలో రంజింపచేయు శైలిలో అందరికి అర్థమగునట్లు వ్రాయించి 12 చక్కటి చిత్రములు చేర్చి ప్రకటించియున్నాము. పూర్తి క్యాలికో బైండు. రాయల్ 1/8 సైజు. సుమారు 1200 పేజీలు వెల: రూ. 20/-. పోస్టేజి ప్రత్యేకం. అడ్వాన్సులేనిదే ఆర్డరు పంపబడదు.
బాలసరస్వతీ బుక్ డిపో, మద్రాసు-1.
SWASTIK

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్ మదరాసు-17

చేనేత చీరె
"కాశ్మీర్ బ్యూటీ"

6 గజాల చేనేత చీరె రు. 8/— మాత్రమే.
2 చీరెలు రు. 15/—
3 చీరెలు రు. 21/—
4 చీరెలు రు. 27/—
ఉత్తమరకం రు.12/—
2 చీరెలు రు. 22/—
ప్రతి ఆర్డరుకు పోస్టేజి, ఒక నూతన సంవత్సరపు డైరీ మరియు 3 లేక 4 చీరెల ఆర్డరుకు ఒక సిల్కు బ్లౌజు ముక్క ఉచితము.
ROSHAN LAL & SONS,
Ajmal Khan Road, (A.B.)
New Delhi-5

ORIGINAL RaceK REGD.

హై పవర్ లాంతరులు
350 కాండ్లు పవరు
ఈ రంగంలో దీనికి ఒక దానికి
IS:1384 ISI
SIZE 2
స్టాండర్డ్ మార్కు వున్నది
రాసెక్ ఇండస్ట్రీస్ ప్రయివేట్ లి.,
శ్రీజి భవన్ లోహార్ స్ట్రీట్, బొంబాయి-2.
డిస్ట్రిబ్యూటర్లు
ఎఫ్. రాసెక్ & కం.
ప్రయివేట్ లిమిటెడ్